సాక్షి నిర్మల్

ఆదివారం । 4 । ఆగస్టు । 2024

గరిష్టం/కనిష్టం
28.4 /24.2

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలాప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

దోస్త్.. మేరా దోస్త్..

స్నేహం.. ఆ దేవుడిచ్చిన గొప్ప వరం. స్నేహానికి కులం లేదు.. స్నేహానికి మతం లేదు.. స్నేహానికి హోదా లేదు... బంధుత్వం కంటే గొప్పది స్నేహం. పేద, ధనిక చూడనిది.. కుల, మత భేదం లేనిది.. బంధుత్వం కన్నా గొప్పది స్నేహం. స్నేహం అంటే భుజం మీద చేయి వేసి నడవడమే కాదు.. నీకెన్ని కష్టాలు వచ్చినా నేనున్నానని భుజం తట్టి చెప్పడం.. వీడిపోనిది నీడ ఒక్కటే.. వాడిపోనిది స్నేహమొక్కటే.. లైఫ్‌లో మంచి ఫ్రెండ్ దొరికితే చాలు.. జీవితాంతం సంతోషంగా బతికేయొచ్చు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్నేహితులపై ప్రత్యేక కథనం. - వివరాలు 8లో▸



న్యూస్‌రీల్

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం

సోన్: తల్లిపాలే బిడ్డకు ఆరు నెలల వరకు సంపూర్ణ ఆహారమని జెడ్పీ సీఈవో గోవింద్, ఐసీడీఎస్ పీవో నాగమణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికతోపాటు గాంధీనగర్, పాక్‌పట్ల, బొప్పారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి పాలు అమృతంతో సమానమన్నారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని తెలిపారు. అనంతరం ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, ఏపీవో మంజుల, ఐకేపీ ఏపీఎం గంగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో



డాక్టర్ రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారిగా డాక్టర్ రాజేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ డీఎంహెచ్‌వోగా పనిచేసిన ధనరాజ్ సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. నిర్మల్ జిల్లాలో డిప్యూటీ వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేస్తున్న డా రాజేందర్‌ను ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కలెక్టర్ నియమించారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహిస్తామని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, శామ్యూల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 బాల బాలికలకు, మహిళలు, పురుషులకు జావెలిన్ త్రో, 100, 400 మీటర్ల పరుగు పందెం ఉంటాయని వివరించారు. గెలుపొందిన వారిని ఈనెల 7న రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే 3వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9440516634 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గమ్యం యాప్‌పై అవగాహన

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమాన్ గమ్యం యాప్‌పై సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి బంధువులు ఆర్టీసీ బస్సులో వస్తే ఎక్కడి వరకు వచ్చారో సులభంగా గమ్యం యాప్‌లో చూసుకోవచ్చన్నారు. ప్రతీ వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లుగా పేరు నమోదు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించేందుకు యువత, అన్నివర్గాల ప్రజలు తమ పేర్లను వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ విధానంలో లింక్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా వచ్చిన గూగుల్ ఫామ్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో గ్రామ పంచాయతీ, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకునే వారు స్థానికంగా నివాసితులై ఉండాలని, ఉత్తమంగా సేవలందించిన వలంటీర్లకు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందిస్తామని వివరించారు. మూడు నెలల తర్వాత సంతృప్తికరంగా ఉన్నవారిసేవలు కొనసాగుతాయని తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసు

నిర్మల్ టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు చౌరస్తాల వద్ద శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 50 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ అందరూ కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

చిక్కిన నకిలీనోట్ల ముఠా..!



జగిత్యాల జిల్లాలో పట్టుబడ్డ నకిలీ నోట్ల ముఠా సభ్యులను అరెస్టు చూపుతున్న పోలీసులు



పోలీసులు పట్టుకున్న నకిలీ నోట్లు

- పొరుగు జిల్లా పోలీసులకు చిక్కిన ఆరుగురు
- పట్టుబడ్డవారిలో నలుగురు మన జిల్లా వాసులే
- స్థానికంగా మోసాలపై పోలీసుల విచారణ

నిర్మల్: చాలారోజుల తర్వాత జిల్లాలో నకిలీనోట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. పొరుగు జిల్లా జగిత్యాల పోలీసులు శనివారం పట్టుకున్న దొంగ నోట్ల ముఠాలో నిర్మల్ జిల్లా వాసులు ఉండటం కలవర పెడుతోంది. వీరు అక్కడే నోట్ల మార్పిడికి పాల్పడ్డారా.. లేక జిల్లాలోనూ మోసాలు చేశారా..? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. నకిలీ రూ.500 నోట్ల మోసం బయట పడటంతో బహిరంగ మార్కెట్లో వ్యాపారులు, వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

పట్టుబడ్డ జిల్లా వాసులు..

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పరిధిలో నకిలీ నోట్లు పేరుతో మోసం చేస్తున్న ముఠాను అక్కడి పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాలో లక్ష్మణచాంద, కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన ముగ్గురు సభ్యులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈకేసుకు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు శనివారం వెల్లడించారు. జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారం గ్రామానికి చెందిన సంజీవ్, జగిత్యాల పట్టణానికి చెందిన శివకుమార్, నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం బుట్టాపూర్‌కు చెందిన ఎం.కిషన్, కడెం మండలం అంబారీపేటకు చెందిన కె.గంగారం, లక్ష్మణచాంద మండలం బోరిగాం గ్రామానికి చెందిన బి.మల్లయ్య, అదే గ్రామానికి చెందిన ఎం.అశోక్ అనే ఆరుగురు ముఠాగా ఏర్పడి నకిలీ కరెన్సీ పేరిట మోసాలకు పాల్పడుతున్నారు.

పోలీసులు వస్తున్నారంటూ..

ఆరుగురు సభ్యుల ముఠా ఫేక్ కరెన్సీని తక్కువ ధరకు ఇస్తామంటూ నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారు. ముందుగా తమ ఒప్పందానికి ఒప్పుకున్న వారు అసలు నోట్లను తీసుకుని తమవద్దకు రాగానే వాటిని తీసుకుని.. సరిగ్గా నకిలీనోట్లను మార్పిడి చేసిచ్చే సమయానికి 'పోలీసులు వస్తున్నారు.. పారిపోండి..' అంటూ అరుస్తూ అక్కడి నుంచి పరారవుతున్నారు. ఇలా ఈ మధ్యకాలంలోనే చాలామందిని మోసం చేశారు. తక్కువ మొత్తానికి నకిలీ కరెన్సీ వస్తే.. దాన్ని మార్కెట్లో చలామణి చేసి పెద్దమొత్తం గడించవచ్చన్న అత్యాశతో ఉన్నవారు వీరి ప్రలోభాలకు బలయ్యారు.

అక్కడ పట్టుబడ్డారు..

ఏడాదికాలంగా నకిలీనోట్ల పేరిట ఆరుగురు సభ్యుల ముఠా చేస్తున్న మోసాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ వచ్చాయి. జిల్లాలోనూ కడెం, దస్తురాబాద్, ఖానాపూర్ ఏరియాల్లో ఈ ముఠా పలువురిని మోసం చేసినట్లు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఉల్టా తమపైనే కేసు అవుతుందన్న భయంతో చాలామంది ఫిర్యాదులు చేయడానికి ముందుకు రాలేదు. జిల్లా పోలీసులకు వీటిపై సమాచారం అందడంతో కొంతకాలంగా నిఘా పెట్టారు. ఇదేక్రమంలో ఈ ముఠా ఈనెల ఒకటిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రాంతంలోని ఓ దాబా యజమాని వద్ద నుంచి రూ.లక్ష లాక్కొని పారిపోయింది. సదరు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు గాలింపు ముమ్మరం చేయడంతో శుక్రవారం మెట్‌పల్లి పరిధిలోని వెంకటరావుపేట వద్ద గల ఓ దాబాలో ఈ ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7 లక్షల నకిలీనోట్లు, కారు, ఒక ద్విచక్ర వాహనం, ఆరు సెల్‌ఫోన్లు, రూ.5,050 అసలైన నగదు స్వాధీనం చేసుకున్నారు.

మార్కెట్లో కలకలం..

నకిలీ నోట్ల ముఠా పట్టుబడిందన్న విషయం తెలియడంతో మార్కెట్లలో రూ.500 నోట్లను వ్యాపారులు, వినియోగదారులు ఆచితూచి తీసుకుంటున్నారు. ఈ ముఠాలో జిల్లా నుంచే నలుగురు ఉండటంతో వారు స్థానికంగా సరఫరా చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. దీంతో ఎవరైనా రూ.500 నోటు తెస్తే ఒకటికి రెండుసార్లు సరిచూసి తీసుకుంటున్నారు. అనుమానం వస్తే తిరస్కరిస్తున్నారు. ఈక్రమంలో అమాయకులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు నకిలీనోట్ల పేరుతో ఈ ముఠా ముద్రించిన నోట్లు చిన్నారులు ఆడుకునే బొమ్మకరెన్సీలా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏదిఏమైనా ఈ ఘటనపై విచారణ చేపడుతున్నామని చెప్పారు.

జిల్లాలోనూ విచారణ..



నకిలీ కరెన్సీ పేరిట మోసాలపై జిల్లాలోనూ గతంలో వచ్చిన సమాచారం మేరకు విచారణ కొనసాగుతోంది. తాజాగా ఆరుగురు సభ్యుల ముఠా జగిత్యాల జిల్లాలో పట్టుబడింది. అందులో జిల్లాకు చెందినవారు ఉన్నారు. దీంతో నిందితుల మండలాల తోపాటు జిల్లా వ్యాప్తంగా విచారణ కొనసాగిస్తున్నాం.

– జానకీషర్మిల, ఎస్పీ

పారిశుధ్యం మెరుగుపడేలా..

- పచ్చదనం పెంపొందించేలా..
- రేపటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం
- ప్లాస్టిక్ నిషేధం, వర్షపు నీటి సంరక్షణపై అవగాహన
- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాలు, పట్టణాల్లో ఈనెల 5 (సోమవారం) నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' పేరిట అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, 396 గ్రామ పంచాయతీల్లో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం.. వివిధ శాఖల సమన్వయంతో 'స్వచ్ఛదనం- పచ్చదనం' నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

కార్యక్రమం ఇలా..

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 5 రోజులపాటు పారిశుధ్య కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలు పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. నీరు నిల్వఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రైడే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీట్యాంకులు, పశువుల తొట్లను శుభ్రం చేయడం, పైపులైన్ లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు రసాయన మందు పిచికారీ చేయించటం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

మొదటి రోజు..

గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాలు, యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలి. ఇళ్లలోని చెత్తను సేకరించి కంపోస్టు ఎరువులు తయారుచేయాలి. పారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపరచాలి. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలి. మరుగుదొడ్లు లేని వారికి వాటిని మంజూరు చేయాలి.

రెండో రోజు..

తాగునీరు, వర్షపు నీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవడం, తాగు నీటి వనరులు శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం, నీటిని పరీక్ష చేయటం లాంటివి చేపడతారు. చెరువులు, కుంటలను సందర్శించి మరమ్మతులకు ప్రణాళికలు తయారు చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు.

మూడో రోజు...

గ్రామాలు, పట్టణాల్లో నీరు నిలిచే ప్రదేశాలు గుర్తించి.. వాటిని పూడ్చటం, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటారు. డ్రైనేజీ నీరు నిలిచే చివరి ప్రాంతంలో సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, వాటర్ ట్యాంకులు, బోరు బావులు, నల్లాల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటారు.

నాలుగో రోజు..

వీధి కుక్కల సంచారంపై దృష్టి పెట్టడం, వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయం తీసుకుంటారు. డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడటంతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉద్యోగులు గ్రామాల్లో ఫీవర్ సర్వేలు నిర్వహించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, యాంటీ లార్వా, ఆయిల్ బాల్స్ తయారీపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

ఎప్పటికప్పుడు నివేదిక

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ ఏరోజుకారోజు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేయాలి. పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్త, మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామస్థాయిలో కార్యక్రమ అమలుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన నివేదికను పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లా అధికారులకు పంపించాలి. పట్టణ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల నివేదికలు కలెక్టర్‌కు ప్రత్యేకాధికారి, వార్డు అధికారులు పంపిస్తారు.

ఐదోరోజు..

కార్యక్రమం చివరి రోజు శుక్రవారం అన్ని కుటుంబాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు సైతం డ్రైడే పాటించాలి. నీటి నిల్వ కనిపించే ప్రతీ ప్రదేశం, ప్రతీ వస్తువును శుభ్రం చేయించాలి. వీటితోపాటు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలి. గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి. ప్రభుత్వ, విద్యా సంస్థలను ఇందులో భాగస్వాములను చేస్తారు.

నిధుల మాటేంటి ?

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అందుకు తగ్గ నిధులు ఉండాలి. నిధులు లేకపోతే క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు పొందడం కష్టం. గత ప్రభుత్వం నిర్వహించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమం, ప్రస్తుత సర్కారు నిర్వహించిన ప్రజాపాలనను నిధులు విడుదల చేయకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు. సొంత డబ్బు, అప్పు చేసి కార్యక్రమాలు నిర్వహించినా బిల్లులు మంజూరు కాలేదు. ప్రస్తుతం సర్పంచులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం బాధ్యత ప్రత్యేక అధికారులపై పడింది. కార్యక్రమం సక్సెస్ కావాలంటే ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

'స్వచ్ఛదనం-పచ్చదనం' అమలుకు ప్రత్యేకాధికారులు

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు జి.రవి
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు కె.ఇలంబరిది

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ అమలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి జిల్లాకు ఇద్దరు ఐఏఎస్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ జి.రవి, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.ఇలంబరిదిలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీరిద్దరు ఇది వరకు ఉమ్మడి జిల్లాలో సేవలందించారు. జి.రవి ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేయగా, ఇలంబరిది ఉమ్మడి జెడ్పీసీఈవో, ఐటీడీఏ పీవో, నిర్మల్ జిల్లా కలెక్టర్‌గానూ సేవలందించారు. వీరికి ఉమ్మడి జిల్లాపై పూర్తి అవగాహన ఉంది. ఆయా జిల్లాల్లో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని వీరు పర్యవేక్షించనున్నారు.

పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ధరణి పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ త్వరగా పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లు-2024 పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ (www.ccla.telangana.gov.in) ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చన్నారు. సలహాలు, సూచనలను ఈ మెయిల్ (ror2024&rev@telangana.gov.in) ద్వారా తెలుపవచ్చని సూచించారు. పోస్ట్ ద్వారా కూడా 'ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్‌ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్ రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, ఆబిడ్స్, హైదరాబాద్ 500001' చిరునామాకు పంపించవచ్చన్నారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్లకు కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలన్నారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారం రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని సూచించారు. సుదీర్ఘ కాలం నుండి పెండింగ్‌లో ఉన్న వాటిని ముందుగా పరిశీలన జరిపి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతి గురించి రోజువారీగా పరిశీలన జరపాలని ఆర్డీవోలకు సూచించారు. ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో ప్రతీ మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేయడం జరుగుతోందన్నారు. వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి చేపట్టిన చర్యలను తెలియజేస్తూ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసే సమయంలో వివిధ అంశాలను పేర్కొనాలన్నారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే, అందుకు కారణాలను సహేతుకంగా పొందుపర్చాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నాకళ్యాణి, కోమల్‌రెడ్డి, సంబంధిత అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా లేఅవుట్ల క్రమబద్ధీకరణ

- కలెక్టర్ అభిలాష అభినవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీ పరిధిలోని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ సూచించారు. ఖమ్మం నుంచి భట్టి, భూపాలపల్లి నుంచి పొంగులేటి, హైదరాబాద్ నుంచి దానకిశోర్ కలిసి కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సరళీకృత చెల్లింపు పథకం(ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా భూముల క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధివిధానాలపై సూచనలు సలహాలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా కమిటీలను రూపొందించాలన్నారు. క్రమబద్ధీకరణ క్రమంలో విధిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూముల క్రమబద్ధీకరణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభ్యసన కార్యక్రమాలపై షార్ట్‌ఫిలిం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల్లో తెలుగు సబ్జెక్టులో నైపుణ్యాలు పెంపొందించేందుకు రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ గత విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖతో కలిసి వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. విద్యార్థులకు వివిధ రకాల కథల పుస్తకాలు, మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నింటినీ వినియోగించుకుంటూ జిల్లాలో జరుగుతున్న అభ్యసన కార్యక్రమాలపై రూమ్ టూ రీడ్ సంస్థ శనివారం మండలంలోని అనంత ప్రాథమిక పాఠశాలలో షార్ట్ ఫిలిం చిత్రీకరించింది. జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ అమలు చేసే విధానం, విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు ఎలా పెంపొందుతున్నాయి... అనే అంశాలపై డీఈవో రవీందర్‌రెడ్డి అందులో వివరించారు. జిల్లాలో అభ్యసన కార్యక్రమాలను ఎంతో పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధతో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని, రూమ్ ఇండియా సంస్థ, ఇతర ఎన్జీవోలు చేస్తున్న సహకారాలు ఇలాగే కొనసాగిస్తే రాబోయే కాలంలో మంచి ఫలితాలను సాధిస్తామన్నారు. ఇందులో ఎస్‌వో నరసయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయురాలు గంగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం'పై అవగాహన

కడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంపై డీఆర్డీవో విజయలక్ష్మి ఆయా శాఖల అధికారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇందులో ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు, ఏపీవో జయదేవ్, ఏఈ గణేశ్, ఏపీఎం రాజారాం తదితరులున్నారు.

కుంటాలలో డీపీవో..

కుంటాల: ఈనెల 5 నుంచి 9వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. కుంటాలలోని రైతు వేదికలో మండలస్థాయి అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ఎంపీడీవో ఎం ఏ.రహీం, డీటీ నరేశ్‌గౌడ్, వైద్యురాలు శృతిరెడ్డి, ఎంఈవో ముత్యం, సూపరింటెండెంట్ రఘువీర్‌రెడ్డి, ఏపీఎం అశోక్, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసాలో ఆర్డీవో

భైంసారూరల్: స్వచ్ఛదనం - పచ్చదనంపై భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి భైంసా మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. రోజువారీ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళ సంఘాలు, యువకులను భాగస్వాములను చేయాలన్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో విరివిగా మొక్కలునాటాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

దోస్త్.. మేరా దోస్త్..



ఆస్తులను ఆర్జించినవాడు కాదు.. అప్పులను సంపాదించుకున్నవాడు నిజమైన అదృష్టవంతుడు. ఎవరి సమక్షంలో మన బాధలు సగం అవుతాయో.. ఎవరి కారణంగా మన ఆనందం రెట్టింపు అవుతుందో వారే అసలైన స్నేహితులు. ప్రపంచం అంతా నిన్ను వదిలిపెట్టినా నీకు తోడుండేవాడే నిజమైన స్నేహితుడు. మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడుతున్న ఈ ఆధునిక కాలంలో స్వచ్ఛమైన స్నేహం కోసం తాపత్రాయపడే వాళ్లెందరో ఉన్నారు. యాంత్రిక జీవనంతో ఉరుకులు, పరుగులతో కాలం వెళ్లదీస్తున్న చాలామందికి ఊరటనిచ్చే అంశం.. ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి నవీన ప్రచార మాధ్యమాలతో ఆత్మీయ మిత్రుల సందేశాలే కలిమి లేముల్లో నేనున్నాను.. అనే విశ్వాసం ప్రకటించే మిత్రులను సంపాదించుకున్న వాళ్లు నిజంగా ధన్యులు. తడి హృదయంతో పొడిబారని వాక్యాలతో, ఆర్ద్రత పంచేవాళ్లు..మనతోపాటు నడిచినంతమేర నవ్వులపువ్వులు పూయించేవాళ్లే స్నేహితులంటే.. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఆస్తులు లేకున్నా..



చెన్నూర్: నేను హన్మకొండలో 1994లో ఇంటర్ చదువుతుండగా ఇజిగిరి పెద్దన్న అనే మిత్రునితో స్నేహం ఏర్పడింది. ఇద్దరం కలిసి డిగ్రీ, పీజీ పూర్తి చేశాం. 2004లో నేను ఎస్సైగా సెలెక్ట్ అయ్యా. పెద్దన్న ప్రభుత్వ ఉపాధ్యాయునిగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాపూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వృత్తి రీత్యా వేరు వేరు శాఖలు అయినప్పటికీ నిత్యం ఫోన్‌లో మాట్లాడుకుంటాం. ఆస్తులు లేకున్నా మంచి స్నేహితులుంటే ఏదైనా సాధించవచ్చు. – రవీందర్, సీఐ, చెన్నూర్

ఆపదలో ఆదుకున్నవాడే..



ఆసిఫాబాద్: స్నేహం ఎంతో విలువైనది. ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు. నిజమైన స్నేహితుడు కష్టాల్లో దూరం కాకూడదు. స్వచ్ఛమైన ప్రేమ ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటా.

– ప్రభాకర్ రావు, అదనపు ఎస్పీ

వారానికోసారి కలుస్తాం



నెన్నెల: స్నేహమనేది ఓ మధురమైన అనుభూతి. ఓవరం లాంటిది. దీనికి వర్ణ, వర్గ, లింగ, జాతి, వయస్సు, స్థాయి, కులాలతో పనిలేదు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతీ మనిషి జీవితంలోనూ స్నేహం అందమైన తీగలా అల్లుకుపోతుంది. అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే ఏకైక పదం స్నేహం. కేకే రావు, మోహన్‌రెడ్డి ఇద్దరూ నాకు బెస్ట్ ఫ్రెండ్స్. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నాం. వారి ప్రోత్సాహం, సలహాలు, సూచనలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. వ్యాపార రంగంలో వారు, రాజకీయ రంగంలో నేను ఎంత బిజీగా ఉన్నా వారానికో సారి కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటాం. అందరం స్నేహభావంతో ఉందాం. నియోజకవర్గ ప్రజలందరికీ స్నేహితుల రోజు శుభాకాంక్షలు.

– గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎమ్మెల్యే

50 ఏళ్లుగా కలిసి మెలిసి..



ఆసిఫాబాద్‌అర్బన్: వీరంతా ప్రస్తుతం 65 సంవత్సరాల వయస్సు పైబడినవారే. ఉద్యోగ విరమణ చేసి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా గడుపుతున్నారు. వీరి స్నేహానికి 50 సంవత్సరాలు నిండింది. 1వ తరగతి నుంచి వీరు కలిసి మెలిసి ఉంటున్నారు. వారిలో ఎవరి ఇంట్లోనైనా ఏదైనా కార్యక్రమం జరిగితే మిగతా వారంతా ఎన్ని పనులున్నా వదులుకుని వస్తారు. అలా కలుసుకున్నప్పుడు వారి సంతోషాన్ని మాటల్లో చెప్పలేం. ఇందులో ఒకరు వారణాసి కిషన్‌రావ్ (హైదరాబాద్), నిమ్మకంటి రమేశ్,(హైదరాబాద్), వైద్య పూర్ణచందర్ రావ్ (ఆసిఫాబాద్), జయప్రకాశ్ (హైదరాబాద్), విద్యాసాగర్(ఆసిఫాబాద్).

స్నేహానికే అర్థం మాస్నేహం



స్నేహానికే అర్థం మాస్నేహం. మేమిద్దరం చిన్న వయస్సులో కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ కాలనీలో నివాసం ఉండేవాళ్లం. మా ఇద్దరి తండ్రులు సర్‌సిల్క్‌లో పనిచేస్తుండేవారు. అతి తక్కువ వేతనంతో ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డాం. కష్టాలు అధిగమించడానికి ఉన్నత చదువులు చదివాం. ప్రస్తుతం రాంబాబు అమెరికాలో ఓ కంపనీకి మేనేజర్‌గా పని చేస్తున్నాడు. నేను (సురేష్‌కుమార్) ఆసిఫాబాద్ జిల్లా వెటర్నరీ అధికారిగా పని చేస్తున్నా. మా ఇద్దరిలో ఎవరికి కష్టం వచ్చినా ఒకరినొకరు సంప్రదించుకుని సమస్య పరిష్కరించుకుంటాం. – సురేష్‌కుమార్, రాంబాబు

నడక కలిపింది..



భోగి వేడుకల్లో సభ్యులు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: ఆరేళ్ల క్రితం వారంతా పరిచయం లేనివ్యక్తులే. నిత్యం మంచిర్యాల బాయ్స్ స్కూల్ మైదానానికి వాకింగ్‌కు వస్తుండే వారు. అలా ఒక్కొక్కరితో మొదలైన స్నేహం 50 మంది పరిచయానికి దారితీసింది. అలా వాకింగ్‌తో మొదలైన స్నేహం ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు వరకు కొనసాగింది. పండుగ వేడుకలు కలిసికట్టుగా గ్రౌండ్‌లో జరుపుకుంటారు. నెలకు రూ.500 చొప్పున జమచేసి అందులోంచి సరదాలకు ఖర్చు పెడుతుంటారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, నోట్‌బుక్స్ అందజేస్తున్నారు. ఇలా ఆరేళ్ల కిందట వాకింగ్‌తో కలిసిన స్నేహం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

స్నేహానికి చిహ్నంగా సోపతి సొసైటీ..



సోపతి సొసైటీ మిత్రబృందం

జైపూర్: జైపూర్ హైస్కూల్ 1998–1999 పూర్వవిద్యార్థుల సమ్మేళనం వేదికగా 2016లో ఏర్పడ్డ సోపతి సోసైటీ స్నేహానికి చిహ్నంగా నిలుస్తోంది. తమతో చదువుకున్న జాడి భానేశ్ అకాల మృతితో ఏర్పడిన సోపతి సొసైటీ వందమంది మిత్రబృందంతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. రక్తదానం, తలసేమియా, సికిల్‌సెల్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. మరణించిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తూ అండగా ఉంటున్నారు. అకాల వర్షాలకు ఇళ్లు కూలిపోయిన నిరుపేదలకు సైతం ఆర్థికసాయం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. 120 మంది మిత్రబృందంలో 20 మంది మృతిచెందగా 100 మంది కొనసాగుతున్నారు.

ఊరి కోసం.. ఆ ఐదుగురు

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన కల్లెం రాజన్న, అప్పాల సునీల్, బక్కంశెట్టి వెంకటేష్, లక్కాకుల వెంకటేష్, మాదాసు వెంకటేష్ ఐదుగురు మిత్రులు. వారిలో నలుగురు ప్రభుత్వ, ఒకరు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సదుద్దేశంతో హెల్పింగ్ హ్యాండ్స్ పేరిట గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి, మృతుల కుటుంబాలకు ఆపత్కాలంలో ఆర్థికసాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

నిలువెత్తు నిదర్శనం..



మిట్ట జలపాతం వద్ద స్నేహితుల సెల్ఫీ

లక్ష్మణచాంద: ఆ ముగ్గురిదీ విడదీయరాని బంధం. ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంతగా కలిసి మెలిసి ఉంటారు. ఒకరు నిర్మల్ జిల్లా చించోలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న అన్నపూర్ణ, మరొకరు కుభీర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కే.హంసలత, వానల్‌పాడ్ పంచాయతీ కార్యదర్శి గాయత్రి. సెలవు దొరికితే చాలు ఆ ముగ్గురు ఏదైనా నూతన ప్రదేశానికి వెళ్లి ఉల్లాసంగా గడుపుతారు. తమ స్నేహానికి పదేళ్లు నిండాయని వారు పేర్కొంటున్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటూ స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

ఆదర్శ స్నేహితులు..!

కుంటాల: మండల కేంద్రానికి చెందిన 2004–05 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదర్శ యూత్‌గా ఏర్పడి తమ స్నేహితులను ఆపదలో ఆదుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సామాజిక సేవతో పాటు గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు. కుంటాలకు చెందిన నెమలికొండ సురేష్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.50వేలు, మిత్రుడు రమణ తల్లి గంగవ్వ మృతి చెందగా రూ.20,100 ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

ఆపదవస్తే ఆదుకుంటాం..



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

జన్నారం: మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్నేహభావం చాటుతున్నారు. వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. తంగళ్లపల్లికి చెందిన రాజన్న భార్య అనారోగ్యం బారిన పడడంతో రూ.60 వేలు, పొనకల్‌కు చెందిన శ్రీనివాస్ కుమార్తె చదువుకోసం రూ.26 వేలు, సేవదాస్‌నగర్‌కు చెందిన స్నేహితుని కుమార్తె వివాహానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మా బ్యాచ్‌లో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకుంటామని ఫజల్‌ఖాన్, గొల్లపెల్లి వెంకటరమణ, రాజన్న, మస్కూద్, ఓదెలు పేర్కొంటున్నారు.

పాతికేళ్ల సుమగంధం...



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన పెందోట వంశీకృష్ణ, దిలావర్‌పూర్ మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన కారగిరి గంగయ్య మధ్య 2000 సంవత్సరంలో ఏర్పడిన స్నేహబంధం పాతికేళ్లుగా కొనసాగుతోంది. గంగయ్య జిల్లా కేంద్రంలోని కోర్టులో పోలీస్ కానిస్టేబుల్‌గా, వంశీకృష్ణ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.ఎన్నో పరిచయాలు ఎక్కడ ఓచోట ఆగిపోతున్న ప్రస్తుత తరుణంలో దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం చిగురించిన స్నేహబంధం మరిన్ని కాలాలపాటు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు. – వంశీకృష్ణ, గంగయ్య

వెలకట్టలేనిది..



మంచిర్యాలక్రైం: కష్టసుఖాల్లో పాలుపంచుకునేవాడే నిజమైన స్నేహితుడు. స్నేహం అంటే అహం, స్వార్థంలేకుండా ఉండాలి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో పరిచయమైన స్నేహం నిజమైన స్నేహం కాదు. స్నేహితులు ఒకరికొకరు తోడుగా ఉండాలి. ప్రపంచంలో వెల కట్టలేనిది స్నేహం ఒక్కటే. ప్రతి ఒక్కరికీ ఒక మంచి స్నేహితుడు ఉండాలి. – ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

45 ఏళ్ల స్నేహబంధం...



భైంసాటౌన్: పట్టణానికి చెందిన దాసరి సురేశ్, జి.సదానందంలది 45ఏళ్ల స్నేహబంధం. సురేశ్ స్థానికంగా వ్యాపారం చేస్తుండగా సదానంద్ గౌడ్ ప్రభుత్వ ఫార్మసిస్ట్‌గా పని చేస్తున్నారు. వృత్తిరీత్యా సాయంత్రం వరకు ఎవరి పనిలో వారున్నా.. ప్రతిరోజు సాయంత్రం ఒక్కసారైనా కలుసుకుంటారు. వీరిని చూసిన ఎవరైనా ఒకరిని విడిచి మరొకరు ఉండరని అంటుంటారు. ఏటా స్నేహితుల దినోత్సవం ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటామని పేర్కొన్నారు. – సదానంద్‌గౌడ్, సురేశ్

చదువులోనూ.. వృత్తిలోనూ



ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన రావుల సరిత, హారికలు చిన్ననాటి మిత్రులు. వీరి స్నేహం పాఠశాల స్థాయిలో మొదలై ఇప్పటికీ ఎలాంటి అరమరికలు లేకుండా సాగుతోంది. చిన్న చిన్న మనస్పర్థలకే బంధాలను తెంచుకుంటున్న ప్రస్తుత సమాజంలో వీరి స్నేహం 30 సంవత్సరాలుగా కొనసాగుతోంది. పాఠశాల, ఇంటర్, డిగ్రీతో పాటు ఎల్ఎల్‌బీ సైతం కలిసి చేశారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని న్యాయస్థానాల్లో న్యాయవాద వృత్తిని కొనసాగిస్తున్నారు. –హారిక, సరిత

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

బేల: మండలంలోని తలాయిగూడ సమీపంలో 1.18 కేజీల ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, ఎస్సై రాధిక తెలిపారు. తలాయిగూడకు చెందిన కుమ్ర పరశురాం పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించి 18 మొక్కలను సీజ్ చేశామన్నారు. గంజాయి తరలించడానికి వినియోగించిన బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.29 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ గంజాయి తరలిస్తున్న కుమ్ర పరశురాంతోపాటు జైనథ్‌కు చెందిన దైగిరి సాయికృష్ణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వారు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

భైంసాటౌన్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు బంగారు గొలుసు అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన బి.లక్ష్మి శనివారం స్థానిక నిర్మల్ చౌరస్తా వద్ద బస్సు దిగి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, బైక్‌పై ఇద్దరు దుండగులు అనుసరించారు. ఆమె మెడలో నుంచి రెండు తులాల గొలుసును అపహరించుకొని పారిపోయారు. దుండగుల ముఖాలకు కర్చీఫ్ కట్టుకొని, నంబర్‌ప్లేట్ లేని బైక్‌పై వేగంగా వెళ్లిన దృశ్యాలు నిర్మల్ చౌరస్తాలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.



నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై పారిపోతున్న దుండగులు

వాగు దాటి వైద్యం



వాగుదాటి దర్మగూడ గ్రామానికి వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఝరి పీహెచ్‌సీ సిబ్బంది శనివారం గాదిగూడ మండలం దర్మగూడకు బయల్దేరారు. వైద్యసామగ్రితో భారీ వర్షంలో వాగుదాటి దాదాపు 2 కి.మీ కాలినడకన బురద రోడ్డుపై వెళ్లి గ్రామానికి చేరుకున్నారు. హెచ్‌ఈ రాథోడ్ రవీందర్, ఏఎన్ఎం సులోచన, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. పరిసరాల్లో ఉన్న నిల్వ నీటిని పారబోశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తల్లిపాల వారోత్సవంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

తొలి ప్రయత్నంలో ఏఈఈగా ఎంపిక



అపర్ణ

జైనథ్: మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన నిరుపేద అయిన క్యాతం రమేశ్–వెంకటమ్మ దంపతుల కుమార్తె అపర్ణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(సివిల్)కి ఎంపికైంది. శుక్రవారం విడుదలైన తుది జాబితాలో సత్తాచాటి ఉద్యోగానికి ఎంపికవడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జేఎన్‌టీయూలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన అపర్ణ తొలి ప్రయత్నంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు ఆమెను అభినందించారు.

గిరిజన యువతకు ఉచిత శిక్షణ

ఇచ్చోడ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన యువకులకు డాక్టర్ రెడ్డి ల్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేఆర్పీ ముకుంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశాలతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, కరీంనగర్‌లో మూడు నెలల శిక్షణ ఉంటుందని తెలిపారు. సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్, ఫుల్‌స్టాక్ డెవలపర్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న యువకులు తమ సర్టిఫికెట్స్‌తో ఈనెల 5 నుంచి 10 తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010295910, 9666748105 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తండ్రిని హత్య చేసిన తనయుడి అరెస్టు

కడెం: తండ్రిని హత్య చేసిన తనయుడిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో ఈనెల 2న తనయుడు తండ్రిని హత్యచేసిన విషయం తెలిసిందే. మద్యానికి బానిసైన తండ్రి కుడిమేత మధు ఇంట్లో వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో భార్య, పెద్దకుమారుడు అనిల్, కోడలిని ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. శుక్రవారం ఇంటికి వచ్చిన అనిల్‌ను ఎందుకచ్చావని మధు గొడవపడ్డాడు. ఈ క్రమంలో అనిల్ తన వెంట తెచ్చుకున్న కర్రతో మధు తలపై మోది హత్య చేశాడు. శనివారం ఉదయం బెల్లాల్ గోదావరి సమీపంలో నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి సీఐ నవీన్‌కుమార్

బురదలో వెళ్లి.. పిల్లలకు వ్యాక్సిన్ వేసి



బోథ్ మండలంలోని రాంనగర్ గ్రామంలో బురద రోడ్డుపై కాలినడకన వెళ్లి సొనాల పీహెచ్‌సీ సిబ్బంది శనివారం చిన్నపిల్లలకు వ్యాక్సిన్ వేశారు. అంతర్రాష్ట్ర రహదారి కౌఠ గ్రామ సమీపం నుంచి రాంనగర్‌కు వెళ్లేదారి ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా ఉంది. వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలన్న ఉద్దేశంతో ఏఎన్ఎంలు చంద్రకళ, మనోజ, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశ కార్యకర్త సరస్వతిలు 4 కి.మీ బురద రోడ్డుపై కాలినడక వెళ్లారు. - బోథ్

పోస్టల్ ఉద్యోగం రాదేమోనని ఆత్మహత్య

పెంబి: పోస్టల్ ఉద్యోగం రాదేమోనని మనస్తాపంతో విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. మండలంలోని అంకెన పంచాయతీ పరిధిలోని బుర్కరేగడి గ్రామానికి చెందిన నైతం జంగు–చంపాబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో పెద్దకుమారుడు దత్తురాం (19) పోస్టల్ ఉద్యోగం రాదేమోనని మనస్తాపంతో గురువారం సాయంత్రం ఇంటి పక్కన ఉన్న పొలంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చి పడిపోగా తండ్రి నైతం జంగు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు గాయపడ్డారు. బస్టాండ్ నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారి వైపు బస్సు వెళ్తుండగా పట్టణంలోని కుమ్రం భీమ్ చౌరస్తాలో జైనథ్ మండలానికి చెందిన రమణని ఢీకొంది. గాయపడిన అతన్ని స్థానికులు రిమ్స్‌కి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మావల మండల పరిధిలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ కారు అతి వేగంతో అదుపుతప్పి రహదారి దాటుకుని కింది వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వృద్ధురాలు శుభ్రంజ్ (70) మృతి చెందగా, ఆమె భర్త సంజీవ్ గాయాల పాలయ్యాడు. 108 సిబ్బంది విఠల్, దీపక్ క్షతగాత్రుడు, వృద్ధురాలిని రిమ్స్‌కు తరలించారు.

గుడిహత్నూర్‌లో ఒకరు..



రవీందర్ (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగొంది వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ఎస్సై ఇమ్రాన్ కథనం ప్రకారం.. సీతాగొందికి చెందిన బీర్ల రవీందర్ (47) స్థానికంగా రాజస్థానీ దాబా నిర్వహిస్తున్నాడు. రాత్రి తన దాబా వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. గాయపడిన అతన్ని స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసు



అశ్విని (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని తురాటికి చెందిన యువతి బోయిని అశ్విని (19) అదృశ్యమైందని ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అశ్విని శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లల్లో, చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. తండ్రి రాము ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

గుంతల రోడ్లతో పరేషాన్..!

- వర్షాకాలంలో పెరిగిన ఇబ్బందులు
- భైంసాలో నరకంగా ప్రయాణం
- అవస్థలు పడుతున్న వాహనదారులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు గుంతలతో అధ్వానంగా మారాయి. సీసీ రోడ్లు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షపునీరు నిలుస్తుండటంతో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అడుగుకో గుంతగా మారిన రోడ్లతో పట్టణవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత అధికారులు రోడ్లపై గుంతలను పూడ్చివేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఎక్కడెక్కడంటే...

- పులేనగర్ నుంచి బస్ డిపో వరకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. డ్రెయినేజీ సరిగా లేక వర్షపు నీరు రోడ్డుపైనే పారుతోంది. కాలినడకన వెళ్లేవారు సైతం ఇబ్బంది పడుతున్నారు.
- స్థానిక ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా నుంచి కుభీర్ వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు లేక మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. పలుమార్లు గుంతల్లో మొరం వేసి పూడ్చివేసినా భారీ వాహనాలు, బస్సుల రాకపోకలతో మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. అంతేగాక, రోడ్డు ఓ వైపు ఇరుకుగా ఉండడంతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు.
- ఓవైసీ నగర్ కమాన్ నుంచి ఏపీనగర్ వరకు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు, ఆటోల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.
- కాలనీలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో కల్వర్టు లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపై నిలిచి చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ఈమార్గంలో కల్వర్టు నిర్మించి డ్రెయినేజీల్లో పూడిక తీస్తే నీరు నిలవకుండా ఉంటుంది.


కంకరతేలి గుంతలు పడిన పులేనగర్-బస్‌డిపో వెళ్లే రోడ్డు


కుభీర్ చౌరసా నుంచి బ్యాంక్ వెళ్లే రోడ్డు దుస్థితి

- గణేశ్‌నగర్, కిసాన్‌గల్లికి వెళ్లే రోడ్లపై సైతం భగీరథ పైప్‌లైన్ పనులతో గుంతలు ఏర్పడ్డాయి.


ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో..

- నాలుగోవార్డు పరిధిలోని పలు కాలనీల్లో సైతం సీసీ రోడ్లు లేక బురదతో చిత్తడిగా మారాయి.

గుంతలు పూడ్చివేయించాలి

పులేనగర్ రోడ్డు అధ్వానంగా మారింది. అడుగుకో గుంత ఏర్పడటంతో వాహనాలు చెడిపోతున్నాయి. వర్షపునీరు నిండుతుండటంతో గుంతలు తెలియక వాహనదారులు కిందపడుతున్నారు. గుంతలు పూడ్చివేయించాలి.

– శ్రీనివాస్, పులేనగర్, భైంసా

చర్యలు తీసుకుంటాం

ఇటీవల నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో పలు రోడ్లకు సంబంధించిన ప్యాచ్ వర్క్ పనులకు తీర్మానం చేశారు. రూ.47 లక్షలతో పలుచోట్ల మరమ్మతులు చేపడతాం. వాహనదారులతోపాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – గౌరీష్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్

పట్టుదలతో చదివితే భవిష్యత్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శనివారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను ఇలాంటి కార్యక్రమాలు బయటకు వ్యక్త పరుస్తాయన్నారు. పట్టుదలతో చదివితే ఉన్నత భవిష్యత్ సొంతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం గతేడాది టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అల్ఫోర్స్ విద్యార్థులతో చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

సుప్రీంకోర్టు తీర్పుపై నేతల హర్షం

కుభీర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రంలోని అన్నాభావుసాఠే విగ్రహం వద్ద శనివారం కుభీర్ మాదిగ సంఘం ఆధ్వర్యంలో నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బాలేరాం ఉత్తమ్, బీజేపీ జిల్లా కార్యదర్శి గంగాధర్, ప్యాట లక్ష్మణ్, బోడిగాం గంగాశేఖర్, పుప్పాల.పిరాజీ, జి.బాబు, సంతోష్, సాయినాథ్ ఉన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఫ్యాక్టరీ పనులు నిలిపివేయండి

దిలావర్‌పూర్: మండల కేంద్రమైన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు వెంటనే నిలిపివేయాలని దిలావర్‌పూర్ రైతులు డిమాండ్ చేశారు. శనివారం దిలావర్‌పూర్ బస్టాండ్ ప్రాంతంలో శాంతియుతంగా ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో వారు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండల ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని.. ఫ్యాక్టరీ కారణంగా వ్యవసాయం కుంటుపడితే తమకు దిక్కెవరని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన కులసంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


దిలావర్‌పూర్‌లో దీక్షలో పాల్గొన్న రైతులు

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండ


పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: కుంటాల ఆదర్శ పాఠశాలలో పని చేసే వృత్తివిద్య ఉపాధ్యాయుడు వాటోలి నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు పోగు చేసిన రూ.1లక్షా13 వేలను నవీన్ పెద్దకూతురు మోక్షశ్రీ పేరిట బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ మేరకు డిపాజిట్ పత్రాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. సహకరించాలని కోరారు.

కళాశాలలో సిబ్బందిని నియమించండి


శృతిఓజాకు వినతిపత్రం ఇస్తున్న విఠల్ రెడ్డి

కుంటాల: కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఇంటర్ బోర్డు కమిషనర్ శృతిఓజా, ఆర్జేడీ జయప్రదను శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. తానూర్ జూనియర్ కళాశాల నూతన భవనంతోపాటు కుభీర్ జూనియర్ కళాశాల సిబ్బంది వేతనం విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించినట్లు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. వారి వెంట దొనికెన వెంకటేశ్, సీడీసీ సభ్యులు ఉన్నారు.

గుంతలు పూడ్చివేత


మట్టి నింపుతున్న పంచాయతీ కార్మికులు

లక్ష్మణచాంద: ఇటీవలి వర్షాలకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శనివారం పంచాయతీ కార్మికులు ప్రమాదక గుంతల్లో మట్టి నింపి పూడ్చివేశారు.

పశువైద్యాధికారిగా ప్రియాంక

కుంటాల: కుంటాల మండల పశువైద్యాధికారిగా కదారి ప్రియాంక శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రకాశ్ బదిలీపై కుభీర్ మండలంలోని పల్సి పశువైద్యశాలకు వెళ్లారు. మంజులాపూర్‌లో పని చేసే ప్రియాంక ఇక్కడకు బదిలీపై వచ్చారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రియాంక

కరెంటుకోతలపై నిరసన


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

సారంగపూర్: అప్రకటిత కరెంటు కోతలపై నిర్మల్ రూరల్ మండలం డ్యాంగాపూర్ గ్రామస్తులు శనివారం చించోలి(బి) గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు చిన్నయ్య, నర్సయ్య మాట్లాడుతూ చిన్నపాటి గాలి, వర్షానికే విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని తెలిపారు. రోజులో కనీసం పది నుంచి 20 సార్లు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేజ్ సరఫరాలోనూ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఏఈ సాయికిరణ్ వచ్చి కోతలు లేకుండా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

తానూరు: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని డీఎల్‌పీవో సుదర్శన్ సూచించారు. శనివారం తానూరులో పర్యటించారు. అనంతరం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసిన నిధుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. నాటిన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జలం సింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తల్లిపాలతో రోగనిరోధకశక్తి

సారంగపూర్: తల్లిపాలతోనే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ టీచర్ స్వరూప అన్నారు. మండలంలోని కంకెట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పోషకాహారం వండిపెట్టారు.

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం అంగన్‌వాడీ టీచర్లు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

ఖానాపూర్: తల్లిపాలల్లోనే అన్ని రకాల పోషకాలు ఉంటాయని కౌన్సిలర్ పరిమి లతసురేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఐదోవార్డు పరిధి ఇంద్రనగర్ కాలనీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, ఏఎన్‌ఎంలు పార్వతి, లావణ్య, హెల్పర్ గంగమ్మ, ఆశవర్కర్ త్రివేణి, సునీత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ లతసురేశ్

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, దస్తురాబాద్, రేవోజీపేట, ఆకొండపేట, భూత్కూర్, పెర్కపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ లలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, రాజమణి, సుగుణ, ముత్తవ్వ, గీత, రేఖ, ప్రమీల, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ముధోల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆబ్కారీ ఎస్సై గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎక్సైజ్ సిబ్బంది అత్తారొద్దీన్, అశోక్, మిజామ్, గౌడ సంఘం సభ్యులు అంజిగౌడ్, వెంకటేశ్‌గౌడ్, సాయిబాబాగౌడ్, దేవేందర్ గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులున్నారు.

కుంటాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రిన్సిపాల్ స్వప్న పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా కుంటాల విజయసాయి పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం తహసీల్దార్ స్వాతి వివిధ రకాల మొక్కలు నాటారు. అంతకుముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వుజారం మహేశ్, ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ అధికారి జాదవ్ మాధవరావు, సంతోష్ పాల్గొన్నారు.


నిర్మల్‌లో మొక్కలు అందిస్తున్న కౌన్సిలర్ నరేందర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బేస్తవార్ పేట్‌లో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నరేందర్ కాలనీ వాసులకు వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు.

అనాథలను అక్కున చేర్చుకుంటాం

నర్సాపూర్(జి): అనాథ పిల్లలను అక్కున చేర్చుకొని ఆదుకుంటామని బాలల సంక్షేమ సమితి సభ్యులు శ్రీలత, అనిల్ పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన స్రవంతి, స్వప్నల తల్లి వనజ ఇటీవల మరణించగా తండ్రి చిన్నతనంలోనే వీరిని వదిలేసి వెళ్లిపోయాడు. ఈ సందర్భంగా వారు శనివారం గ్రామానికి వెళ్లి నిత్యావసర సరుకులు అందజేశారు. 20కిలోల బియ్యం, పప్పు, నూనె, కోడిగుడ్లు అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అందించారు. బాలికలను వసతిగృహంలో చేర్పించి చదువు చెప్పిస్తామని.. ప్రభుత్వం వీరికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులు మురళి, రాజు, గంగాధర్, నరేందర్, మమత, అంగన్‌వాడీ టీచర్లు గోదావరి, స్వరూప పాల్గొన్నారు.


సరుకులు అందజేస్తున్న సభ్యులు

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

భైంసాటౌన్: పట్టణంలో మున్నూరుకాపు పట్టణ సంఘ భవనానికి స్థలం కేటాయించాలని ఆ సంఘ పట్టణ కమిటీ నాయకులు కోరారు. ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. పట్టణ కమిటీ నూతనంగా ఏర్పాటైన నేపథ్యంలో సంఘ భవనం కోసం స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు బాజనోల్ల గంగాధర్, టౌన్ మున్నూరుకాపు అధ్యక్షుడు యనుపోతుల మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆకుల గోపాల్, సలహా కమిటీ సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

భైంసాలోని పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. రాహుల్‌నగర్‌కు చెందిన మచ్కల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మాకర్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.


ఎమ్మెల్యే రామారావుకు విన్నవిస్తున్న నాయకులు

'నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్'

కుంటాల: ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటూ జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని ఆ పార్టీ యూత్ కాంగ్రెస్ తాలుకా ఇన్‌చార్జి ఆలూరి ప్రశాంత్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్ర భుత్వ హయాంలో పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాతో నిరుద్యోగుల కల నెరవేరలేదని విమర్శించారు.

స్వచ్ఛదనం–పచ్చదనం విజయవంతం చేయండి

ఖానాపూర్: గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. ఈనెల 5 నుంచి 9 వరకు చేపట్టే కార్యక్రమాలపై శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్, వార్డు స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకా ధికారి బాబురావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఎంపీడీవో సునీత, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీవో రత్నాకర్‌రావు ఉన్నారు.

తానూరు: ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులకు స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఎంపీవో నసీరుద్దీన్ మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. శుభ్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, ఐసీడీఎస్ సూ పర్‌వైజర్ అనిత, ఆర్‌ఐ మోహన్‌సింగ్, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న చైర్మన్ సత్యం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం స్వచ్ఛదనం- పచ్చదనంపై ఎంపీఓ తిరుపతిరెడ్డి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ పుష్పలత, మండల ప్రత్యేకాధికారి అంజిప్రసాద్, డీటీ వాహీదొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మామడ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీకళ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, ఏపీవో శివాజీ, ఏపీఎం అరుణ, డీటీ సంతోష్, వెటర్నరీ అసిస్టెంట్ మహేశ్, లస్మన్న పాల్గొన్నారు.


మామడలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీకళ

దిలావర్‌పూర్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రత్యేక సమావేశం నిర్వహించగా డిప్యూటీ సీఈవో శంకర్ హాజరై మాట్లాడారు. రోజువారి కార్యక్రమాల్లో గ్రామస్తులను భాగస్వాముల్ని చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ అరుణరాణి, ఎంపీఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు పునరుద్ధరించకుంటే ఆందోళనలు

ఖానాపూర్: ఖానాపూర్ మార్గంలోని రెంకోనివాగు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కా ర్యదర్శి ఉపాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శని వారం వాగు వద్ద కొట్టుకుపోయిన రోడ్డు పరిశీలించి మాట్లాడారు. మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించకుంటే 20 గ్రామాల ప్రజలతో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

ఖానాపూర్: మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో మధుసూదన్ అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రాథమిక పాఠశాల, విద్యానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో సందర్శించారు.

పౌష్టికాహారం అందించండి

కుంటాల: కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కుంటాల రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడారు.

'ప్రైవేట్ టీచర్లను కించపర్చడం తగదు'

భైంసాటౌన్: ప్రైవేట్ టీచర్లను కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం తగదని సామాజిక కార్యకర్త జాదవ్ పుండ్లిక్‌రావు అన్నారు. శనివారం ఆయన పట్టణంలో మాట్లాడారు. డిగ్రీ ఫెయిల్ అయినవారే ప్రైవేట్ టీచర్లని సీఎం అనడాన్ని ఖండిస్తున్నామన్నారు.

గురుకులం సందర్శన

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న శనివారం సందర్శించారు. వంట గది పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వెంకటేశ్, మహేందర్, కమలాకర్ తదితరులున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మామడ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు, నంబర్‌ప్లేట్ లేని వాహనాలకు జరిమానా విధించారు. వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని సీఐ నవీన్‌కుమార్ అన్నారు. ఎస్సై సందీప్, పోలీసులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ తోపాటు గుండంపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం సాయంత్రం ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు మాన్సింగ్, దేవేందర్ గౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు సాయన్న, మహేందర్, హోంగార్డ్ షాహీద్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కలమడుగు-పాండ్వాపూర్ ప్రధాన రోడ్డుపై శనివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు నాకాబంద్ నిర్వహించారు. ధ్రువపత్రాలు పరిశీలించి.. వాహనాల్లో తరలించే వస్తువుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్సై శంకర్, హెడ్ కానిస్టేబుల్ బాపురావ్, రాజలింగన్న, సిబ్బంది రవి, వనిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మామడలో తనిఖీ చేస్తున్న పోలీసులు

'డబుల్ బెడ్రూం ఇళ్లు అప్పగించండి'

భైంసాటౌన్: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద చేపట్టిన దీక్ష శనివారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడాది దాటుతున్నా అప్పగించడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికీ ఇళ్లలో కనీస వసతులు కల్పించలేదన్నారు. వెంటనే సౌకర్యాలు కల్పించి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిధర్ జంగ్మే, సిలారం సత్యనారాయణ, రాము, వకీల్, మహేశ్, నయీమ్, సతీశ్, బట్టి భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

భైంసాటౌన్: కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని భైంసా కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.అరుణ అన్నారు. శని వారం తన కార్యాలయంలో భైంసా డివిజన్ పోలీస్, ఎక్సైజ్‌శాఖ అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత కొత్త చట్టాలపై చర్చించారు. మహిళ సంరక్షణ చట్టాలు, తదితర విచారణ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ముధోల్, తానూర్, బాసర, లోకేశ్వరం, కుభీర్, కుంటాల ఎస్సైలు, భైంసారూరల్ సీఐ, భైంసా ఎక్సైజ్ ఎస్సైలు ఉన్నారు.


సమావేశానికి హాజరైన సీఐలు, ఎస్సైలు